క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రి ప్రదక్షిణగా మంగళ వాయిద్యాల నడుమ తీసుకెళ్లారు. అనంతరం అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

జాతీయ క్వాంటమ్ మిషన్‌తో ప్రగతి



ఎన్‌పీఎల్ డైరెక్టర్ వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

కొమ్మాది: గణిత, భౌతిక శాస్త్రాలు, కంప్యూటర్ సైన్స్‌లోని మౌలిక అంశాల ఆధారంగా పనిచేసే క్వాంటమ్ టెక్నాలజీతో దేశ సాంకేతిక ప్రగతి భవిష్యత్‌లో కొత్త పుంతలు తొక్కుతుందని, ఇందుకోసం భారత ప్రభుత్వం రూ.6 వేల కోట్లతో నేషనల్ క్వాంటమ్ మిషన్ ఫండ్ నెలకొల్పిందని జాతీయ పరిశోధన సంస్థ నేషనల్ ఫిజిక్స్ లేబొరేటరీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆచంట వేణుగోపాల్ అన్నారు. గీతంలో నిర్వహించిన యువ భౌతిక శాస్త్రవేత్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సాంకేతిక పరిజ్ఞానం కోసం ఇతర దేశాలపై ఆధారపడకుండా పూర్తి స్వదేశీ పరిజ్ఞానాన్ని రానున్న సంవత్సరాల్లో అభివృద్ధి చేయడానికి క్వాంటమ్ మిషన్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత



కేజీహెచ్‌లో పెంటయ్యకు పింఛన్ నగదు అందిస్తున్న చిట్టివలస వలంటీర్ భాను

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ చిట్టివలస వార్డు సచివాలయ వలంటీర్ కొంత్యాన భాను శుక్రవారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న తమ్మిన పెంటయ్యకు రూ.3 వేల పింఛన్ నగదు అందించారు. కొండపేటకు చెందిన 74 ఏళ్ల పెంటయ్య పది రోజుల క్రితం అనారోగ్య కారణాలతో కేజీహెచ్‌లో చేరాడు. నడవడానికి కూడా అవకాశం లేకపోవడంతో మరో రెండు వారాలు అక్కడే చికిత్స తీసుకోనున్నాడు. ఈ నేపథ్యంలో వలంటీర్ ఆస్పత్రికి చేరుకుని పింఛన్ అందించారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



మారికవలస ఆర్‌జీకే కాలనీలో పింఛన్ నగదు అందిస్తున్న నాయకులు, వలంటీర్లు

మధురవాడ: ఒకటో తారీఖు వచ్చిన రోజు తొలిపొద్దు కూడా పొడవక ముందే వలంటీర్లు ఇంటికొచ్చి అవ్వ, తాతలకు పింఛన్లు అందించారు. తెల్లారక ముందే ఇంటి తలుపు తట్టి మరీ పింఛన్ నగదు అందించడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. వలంటీర్లకు వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా తోడవ్వడంతో జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లో పింఛన్ల పంపిణీ మరింత చురుగ్గా సాగుతోంది. 5వ వార్డు మారికవలస, ఆర్‌జీకే కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు బోయి సుజాత, కన్వీనర్లు గాయత్రి, రుషికేష్ లబ్ధిదారులకు పింఛన్ నగదు అందించారు.

పథకాల అమలుకు వైఎస్సార్‌సీపీనే గెలిపించండి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



తాళ్లవలస పీహెచ్‌సీలో 6 పడకల యూనిట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తగరపువలస: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవ్వాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని తాళ్లవలస, తాటితూరు, మజ్జిపేట, నారాయణరాజుపేట, అన్నవరం పంచాయతీల్లో రూ.3.25 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, భూమిపూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీటిలో రైతుబజారు, జల్ జీవన్ మిషన్, వెల్‌నెస్ సెంటర్, 'నాడు – నేడు' పథకంలో తాళ్లవలస పీహెచ్‌సీలో ఆరు పడకల ఏర్పాటు, అంగన్‌వాడీ భవనం నిర్మాణం తదితర పనులున్నాయి. ఈ సందర్భంగా ఆయన తాళ్లవలసలో మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకే అధికారులు, సచివాలయ – వలంటీర్ వ్యవస్థలు ఉన్నాయన్నారు.



తాటితూరులో కుళాయి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

వీటి అమలులో లోపాలు జరిగితే దేవుడు క్షమించడన్నారు. ధర్మబద్ధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ పంచాయతీని గతంలో టీడీపీ పట్టించుకోలేదన్నారు. 33 ఏళ్ల తాళ్లవలస చరిత్రలో తొలిసారిగా వైఎస్సార్‌సీపీ బలపరచిన సర్పంచ్‌ను ఇక్కడి ప్రజలు గెలిపించారన్నారు. అందుకు గుర్తుగా ఈ పంచాయతీకి చెందిన సూర్యనారాయణను భీమిలి ఏఎంసీ చైర్మన్‌గా నియమించామన్నారు. పంచాయతీలో కొత్తగా పన్నుల విధింపు, శ్మశానవాటికలకు రహదారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పొరపాటున చంద్రబాబు గెలిస్తే సచివాలయ వ్యవస్థ, సంక్షేమ పథకాలు నిలిచిపోతాయన్నారు. చంద్రబాబుతోపాటు సినిమా వాళ్లను ప్రజలెవరూ నమ్మవద్దన్నారు. లంచాలు తీసుకోకుండా, కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డినే రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భీమిలి ఎంపీడీవో జానకి, పీహెచ్‌సీ వైద్యులు ఏబీ మల్లికార్జునరావు, శోభారాణి, వై.దుర్గాకల్యాణి, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, యూత్ అధ్యక్షుడు చిల్ల హరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు బోని జగ్గమ్మ, సన్నిబాబు, శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు, కాద సూర్యనారాయణ, మేరుగు సంతోషికుమారి, మజ్జి సూరినాయుడు, చెల్లూరి నగేష్, ఉండబట్ల ఆదిలక్ష్మి, మజ్జి శ్రీనివాసరావు, గాడు వెంకటనారాయణ, లచ్చుబుగత జగదీశ్వరరావు, మద్దిల వెంకటరమణ, దుంపల నాగమణి, అక్కరమాని అప్పలనాయుడు, బీఎస్ఎన్ రాజు, దంతులూరి వేణు, గాడు తాతినాయుడు, పొట్నూరు చంద్రశేఖర్, పల్లంటి శ్యామ్‌సుందరరావు, బొడ్డు దుర్గారావు, రవ్వ ఈశ్వరరావు, భాగం సుధాకర్, గుడ్డాల ఎల్లయ్య, తోట ఎల్లారావు, సింగిడి అప్పలరాజు, కొయ్య శ్రీనివాసరెడ్డి, తుపాకుల పైడిరాజు, అక్కరమాని రమణ, ఎలమంచిలి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తాటితూరులో రైతుభరోసా కేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

గ్రామీణులను చైతన్య పరచాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న కళాశాల సిబ్బంది

ఆనందపురం : యువత గ్రామీణ ప్రాంత ప్రజలను చైతన్యపరిచి, సమాజాభివృద్ధికి కృషి చేయాలని గొట్టిపల్లి సర్పంచ్ గంటా జగదీష్ సూచించారు. పంచాయతీ పరిధిలోని వెంకటాపురంలో గాయత్రి విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం సేవా శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ జగదీశ్వరరావు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం, పారిశుధ్యంపై పూర్తి స్థాయి అవగాహన కలిగించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పూల మొక్కలు పంపిణీ చేశారు. వారం రోజులపాటు నిర్వహించే శిబిరం ద్వారా వివిధ అంశాలపై సర్వే చేసి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏబీ కోటేశ్వరరావు, పీవోలు జగదీశ్వరరావు, వంశీకృష్ణ, హెచ్‌ఎం జయభారతి, కోరాడ శ్రీను, గురునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో పేదలకు మెరుగైన వైద్యం

పద్మనాభం: పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం చుట్టారని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని మద్ది గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రోగులు కార్పొరేట్ వైద్యం కోసం దూరంగా వెళ్లకుండా వారి ఇళ్ల చెంతనే వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. శిబిరంలో 517 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుగత సత్యనారాయణ, బుగత శ్రీనివాసరావు, వైద్యాధికారిణి కాళ్ల మణికుమారి, తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

కోడి పందేలు ఆడుతున్న 14 మంది అరెస్ట్

ఆనందపురం : మండలంలోని గండిగుండం గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్న 14 మందిని టాస్క్‌ఫోర్స్, ఆనందపురం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ ప్రసాద్, ఆనందపురం సీఐ టీవీ తిరుపతిరావు, సిబ్బంది గండిగుండం గ్రామ శివారున మామిడితోటలో స్థావరంపై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ మేరకు కోడి పందేలు ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.14 వేల నగదు, నాలుగు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు. 14 మందిని అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామయ్యవలసలో పది మంది...

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ సామయ్యవలసలో శుక్రవారం కోడి పందేలు ఆడుతున్న పది మందిని అరెస్ట్ చేసినట్టు సీఐ సీహెచ్.శ్రీధర్ చెప్పారు. సామయ్యవలసలో గోస్తనీ నది పక్కన మామిడి తోటలో కోడి పందేలు అడుతున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసినట్లు ఆయన తెలిపారు. పది మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.15,640 నగదు, నాలుగు కోడి పుంజులు, పది బైక్‌లు, ఏడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

క్రమశిక్షణతో పరిశోధనలు సాగించాలి



సదస్సు ప్రత్యేక సంచిక విడుదల చేస్తున్న విశ్రాంత ఉపకులపతి రాంజీ, తదితరులు

తగరపువలస: విద్యార్థులు నిరంతరం కష్టపడే తత్వంతో, క్రమశిక్షణతో పరిశోధనలు సాగిస్తే అబ్దుల్ కలాం, రతన్‌టాటా, సత్యనాదెళ్లలా ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అంబేడ్కర్ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉప కులపతి, ఆంధ్ర విశ్వవిద్యాలయం మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కె.రాంజీ అన్నారు. సంగివలస అనిట్స్‌లో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైన ఎలెక్ట్రా 23 24 జాతీయ స్థాయి సాంకేతిక సమ్మేళనం ప్రారంభంలో ఆయన మాట్లాడారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఐవోటీ, వీఎల్ఎస్ఐ, ఫైవ్ జీ కమ్యూనికేషన్స్ వంటి ఆధునిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ కాల్వ శ్రీరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులను భవిష్యత్ సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దడానికి తరచూ కళాశాలలో సాంకేతిక సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పరిశోధనలకు అవసరమైన వసతులు యాజమాన్యం సమకూరుస్తుందన్నారు. ఈసీఈ విభాగాధిపతి బండి జగదీష్, అకడమిక్ హెడ్ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పైప్‌లైన్ల ఏర్పాటుకు చర్యలు

రూ.3 కోట్లతో చురుగ్గా పనులు



భారీ వాహనంతో తీసుకొచ్చిన పైపులు

భీమునిపట్నం: భీమిలి పట్టణ వాసులకు తాగునీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం కేటాయించిన నిధులతో కొత్త పైపులు అధికారులు తీసుకొచ్చారు. ఇక్కడి ప్రజలకు రోజూ తగరపువలస పంప్ హౌస్ నుంచి పెద్ద పైప్‌లైన్ ద్వారా బ్యాంక్‌రోడ్డు, కృష్ణా కాలనీలోని ట్యాంకులకు నీరు సరఫరా చేస్తారు. ఇక్కడి నుంచి పెద్ద బజారు, ఎగువపేట, నేరెళ్లవలస కాలనీ, దాని పరిసర ప్రాంతాలకు బ్యాంక్ రోడ్డు పక్కన ఉన్న ట్యాంకు ద్వారా రోజుకు తొమ్మిది లక్షల లీటర్ల నీరు సరఫరా చేస్తారు. అలాగే కృష్ణాకాలనీ ట్యాంకు ద్వారా కృష్ణాకాలనీ, బ్యాంక్‌కాలనీ, చిన్నబజారు, గాడువీధి, కొంకువీధి, తోటవీధి ప్రాంతాలకు ఎనిమిది లక్షల లీటర్ల నీరు సరఫరా చేశారు. అయితే గతంలో నాణ్యత లేకుండా వేసిన ప్రధాన పైప్‌లైన్ తరచూ పగిలిపోతుండడంతో నీటి సరఫరాకు పెద్ద ఆటంకంగా మారింది. వేసవి సమీపిస్తుండడం, రెండు మూడు రోజులకోసారి పైప్‌లైన్ పగిలిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వాలు ఈ సమస్యను పట్టించుకోలేదు. ఎంతో కీలకమైన ఈ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవ చూపారు. పటిష్టంగా పైప్‌లైన్ ఏర్పాటుకు అంచనాలు తయారుచేయించి రూ.3 కోట్ల నిధులు కేటాయించారు. ఆ నిధులతో నాణ్యమైన డీఐ 350 కేటగిరీ పైప్‌లను జాప్యం చేయకుండా భారీ వాహనాల ద్వారా భీమిలి తీసుకొచ్చారు. వాటిని చిల్లపేట నుంచి భీమిలి వుడా మైదానం వరకు 2.30 కిలోమీటర్ల దూరం వరకు, భీమిలి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి బ్యాంకు రోడ్డులోని మంచినీటి ట్యాంకు వరకు 600 మీటర్ల దూరం వరకు ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులను అధికారులు ప్రారంభించి రెండు నెలల్లో పూర్తి చేయడానికి నిర్ణయించారు. ఈ కొత్త పైప్‌లైన్ అందుబాటులోకి వస్తే పైపులు పగిలే అవకాశం వుండదని, రోజూ నిరాటంకంగా నీటి సరఫరా జరుగుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగాలకు 92 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

భీమునిపట్నం: భీమిలి మహిళ పాలిటెక్నిక్ కళాశాల వద్ద శుక్రవారం సినర్జీ క్యాస్టింగ్స్ లిమిటెడ్ యాజమాన్యం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 92 మంది ఎంపికయ్యారు.

వీరికి కంపెనీ ప్రతినిధులు నియామకపత్రాలు అందించారు, సంవత్సరంపాటు శిక్షణ కాలంలో నెలకు రూ.14 వేలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఇక్కడి కళాశాల నుంచి ఇంతమంది ఉద్యోగాలకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వీరిలాగే రాబోయే రోజుల్లో ఇతర విద్యార్థినులు కూడా ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. కంపెనీ ప్రతినిధులు శ్రీనివాస్, సుబేదా బేగం పాల్గొన్నారు.

డ్రైనేజీలపై నిర్మాణాలు తొలగించండి

భీమిలి జోనల్ అధికారులకు జెడ్సీ ఆదేశం



కె.నగరపాలెంలో అనధికారిక నిర్మాణాలు పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం నుంచి బోయపాలెం వరకు డ్రైనేజీలపై కమర్షియల్ నిర్మాణాలు చేపట్టడంపై జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వార్డులోని మంగమారిపేట, కె.నగరపాలెం, సోమన్నపాలెం, కాపులుప్పాడ ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. కె.నగరపాలెంలో ప్రధాన రహదారి వెంబడి అనుమతులు లేకుండా డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుంటే సచివాలయ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల నిర్మించిన రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఇసుక, సిమెంట్ వేసేశారని, వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు వెంబడి అనధికారిక నిర్మాణాలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వెంటనే తొలగించాలని ఆమె కోరారు. అదేవిధంగా కాపులుప్పాడ గెడ్డ వద్ద అనధికారికంగా చెరువు నుంచి నీటిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మంగమారిపేటలో బీచ్‌రోడ్డు వెంబడి ఏర్పాటు చేసిన డ్రైనేజీలపై శాశ్వతంగా ఏర్పాటు చేసిన పలకలను తొలగించాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో ఆమెతోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు, తదితరులు ఉన్నారు.

చిన్నారి వైద్యానికి రూ.5 లక్షల సాయం

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు బింద్రానగర్‌కి చెందిన జస్వితకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.5లక్షల చెక్కు అందజేశారు. పుట్టుకతో మూగ, చెవుడుతో బాధపడుతున్న ఏడేళ్ల జస్విత వైద్యానికి తల్లిదండ్రులు పలు ఆస్పత్రుల్లో సంప్రదించగా లక్షలాది రూపాయలు ఖర్చు అవుతాయని చెప్పడంతో వారు వైఎస్సార్‌సీపీ నాయకులను ఆశ్రయించారు. ఈ మేరకు శుక్రవారం తన నివాసంలో వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కు ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సమష్టి కృషితో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న పోతిన శ్రీనివాసరావు

మధురవాడ: నగరాల కులస్తుల సమస్యల పరిష్కారానికి అంతా సమష్టిగా కృషి చేయాలని మధురవాడ 14 గ్రామాల పెద్దలు తీర్మానించారు. మధురవాడ పిలకవానిపాలెంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయింపు అంశం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇతర సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పని చేద్దామని తీర్మానించారు. రాజకీయాలకు అతీతంగా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డులకు చెందిన కుల పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన నేడు

ఆనందపురం : మండలంలోని గ్రామాల్లో శనివారం పలు అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొంటారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బంక సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి పర్యటన ప్రారంభమవుతుందని తెలిపారు. ఆనందపురం, చందక, శొంఠ్యాం గ్రామాల్లో జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ, జల జీవన్ మిషన్ మంచినీటి పథకాల ప్రారంభోత్సవం, పలు శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దర్జాగా మొగిదబంద కబ్జా



మొగిద బందను ఆక్రమించి నిర్మిస్తున్న రోడ్డు

ఆనందపురం : మండలంలోని కుసులువాడ పంచాయతీ పరిధిలో ఓ బందను రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించి దర్జాగా లే అవుట్ వేస్తున్నాడు. కుసులువాడ సర్వే నంబరు 106లో 5.16 ఎకరాల్లో మొగిదబంద విస్తరించి ఉంది. ఆ బందకు ఆనుకొని ఉన్న సీలింగ్ భూమిని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. కాగా ఆ సీలింగ్ భూమిలో వేసిన లే అవుట్‌కు రోడ్డు లేకుండా పోయింది. దీంతో దాని ముందు భాగంలో ఉన్న మొగిద బందలో రెండెకరాల మేర ఆక్రమించి అందులో లే అవుట్ వేయడంతో పాటు రోడ్డు ఏర్పాటు చేశారు. గత 20 రోజులుగా యంత్రాలతో పనులు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆ స్థలం విలువ రూ.5 కోట్ల వరకు ఉంటుంది.

స్టేటస్‌కో పేరుతో అధికారులకు బురిడీ

మొగిదబంద పక్కనే గల సీలింగ్ భూమిని కొనుగోలు చేసిన వ్యాపారి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే అలా చేయడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని అధికారులు ఆ భూమి స్వాధీనానికి యత్నించగా కోర్టుకు వెళ్లి స్టేటస్ కో ఆర్డర్ తెచ్చుకున్నట్టు తెలిసింది.

ఆ ఆర్డర్‌ను అడ్డం పెట్టుకొని బంద ప్రాంతాన్ని ఆక్రమించి లే అవుట్ పనులు చేపడుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ హేమంత్ కుమార్ వివరణ కోరగా బంద ఆక్రమణ విషయం తమ దృష్టికి రాలేదన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దుకాణం పాక్షికంగా దగ్ధం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట మలుపు వద్ద శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో బాకి రమణమ్మకు చెందిన కూరగాయల దుకాణం పాక్షికంగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో కమ్మల దుకాణంతోపాటు కూరగాయలు పాడయ్యాయి. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. రూ.15 వేల వరకు నష్టం జరిగిందని అంచనా. వైఎస్సార్‌సీపీ నాయకులు జీరు వెంకటరెడ్డి, వెంపాడ వెంకటరమణ బాధితురాలిని పరామర్శించారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

కూర్మన్నపాలెం : పదేళ్ల బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని దువ్వాడ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం ... పెదగంట్యాడ మండలం ఇస్లాంపేట గ్రామానికి చెందిన బాలిక శుక్రవారం ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన తోహిదు షేక్ (30) అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో భయపడిన బాలిక తల్లి వద్దకు వెళ్లి విషయాన్ని చెప్పడంతో ఆమె దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దిశ పోలీసులకు అప్పగించారు.